క్లుప్తంగా

నాటక కళాకారుడు చంద్రశేఖరరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం గుడిగంటలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం రక్తసంబంధం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు గంగిశెట్టి చంద్రశేఖరరావును సన్మానించారు. కార్యక్రమంలో మల్లవరపు విజయ్, షేక్ జాఫర్ సాధిక్, కనికరం యోగేష్, ప్రత్తిపాటి రాజేష్, మతిజెట్టి రేణుక, పెమ్మసాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీలో శిక్షణ



నందివెలుగు(తెనాలి): తెనాలి రూరల్ మండలం నందివెలుగు ప్రకృతి వ్యవసాయం యూనిట్‌లో కనకదుర్గ వీవోలో మంగళవారం విత్తన గుళికల తయారీపై శిక్షణనిచ్చారు. విత్తన గుళికలను భూమిలో వేసినందున ఆరు నెలల వరకు నిల్వ ఉంటుందని, చీమలు తినకుండా ఉంటాయని, బంకమట్టి కారణంగా విత్తనంలో తేమ శాతం ఉంటుందని, ఘన జీవామృతం విత్తనంలోని జీవాన్ని ప్రేరేపిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్1 జి.విజయకుమారి, జి.రేణుకకుమారి, ఐసీఆర్‌పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహావీర్ శోభాయాత్ర



తెనాలిరూరల్: జైన తీర్థంకర్ మహావీర్ స్వామి జయంతి సందర్భంగా తెనాలి పట్టణ జైన సంఘీయుల ఆధ్వర్యంలో మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. తొలుత మహావీర్ స్వామి చిత్రపటాలను పూలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. తెనాలి గంగానమ్మ పేటలోని జైన మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నెహ్రూ రోడ్, గాంధీ చౌక్, బోస్ రోడ్డు, మెయిన్ రోడ్ల మీదుగా తిరిగి ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. ఈ శోభాయాత్రలో సంఘ పెద్దలు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహావీరుని ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ, నృత్యాలు చేశారు. జైన మత ఉద్దేశాన్ని తెలియజేశారు.

7న ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆంజనేయం ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7న గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా మండలి కన్వీనర్ తాడికొండ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం ఐదు గంటలకు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ శిబిరం ఉంటుందని, శిక్షణలో ఎనిమిదేళ్ల నుంచి 80 సంవత్సరాల వయస్సు వారందరూ పాల్గొనవచ్చని వివరించారు. సుమారు 20 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి 11 రకాల యోగా పుస్తకాలు ఇస్తామని పేర్కొన్నారు.

ఘనంగా రెడ్డినగర్ తిరునాళ్ల



నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి వారి 21వ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆకుపూజలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంక్షేమంతో జీవన ప్రమాణాలు మెరుగు

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగాయని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మహిళలు కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటూ బిడ్డల్ని చదివించుకుంటున్నారని చెప్పారు. పేద మహిళలతోపాటు భర్తను కోల్పోయిన వితంతువులు, ఒంటరి మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధి ఎంతగానో భరోసానిస్తోందని తెలియజేశారు. మరోవైపు సంక్షేమంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు.

3వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు మంగళవారం పట్టణంలోని 30, 31, 32, 33, 34 వార్డుల పరిధిలో చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలు ప్రాంగణంలో జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. వార్డుల్లోని 1,456 మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.1.46 కోట్ల చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 80 లక్షల మంది మహిళలు సభ్యులుగా గల డ్వాక్రా సంఘాలు గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయని గుర్తుచేశారు. డ్వాక్రా మహిళలకు ఆర్థిక తోడ్పాటు అవసరమని భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డీతో సహా రూ.24 కోట్లుగా ఉన్న డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం వడ్డీతో సహా ఇప్పటికి రూ.25 వేల కోట్లకు చేరిన రుణమాఫీ మొత్తంలో గత మూడు విడతలుగా రూ.19,134 కోట్లను జమచేశారని చెప్పారు. నాలుగో విడత డబ్బులను గత అసెంబ్లీ సమావేశాల్లోనే బడ్జెట్లో కేటాయించి ఆ మొత్తాన్ని జనవరిలో ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అంటే సహాయక సంఘాల్లోని మహిళలకు రూ.25 వేల కోట్లను ప్రభుత్వం జమచేసినట్టవుతుందని వివరించారు. సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలవుతున్న తీరు గురించి ఎమ్మెల్యే విశదీకరించారు. సంక్షేమ సర్కారుకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, కౌన్సిలర్లు కొమరాబత్తుని జయపాల్, గోగిరెడ్డి మానసారెడ్డి, మట్లపూడి సంధ్యారాణి, మొగల్ అహ్మద్, పేరం సంజీవరెడ్డి, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, మార్కెట్ యార్డు డైరెక్టర్ రాయపూడి జ్యోత్స్న, పార్టీ నేతలు కఠారి హరీష్, సయ్యద్ గౌస్, అరుణ పాల్గొన్నారు. 'మెప్మా' మాధవరావు స్వాగతం పలికారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అజెండా

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభం



ప్లకార్డులతో ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఈబీసీ నేస్తం లబ్ధిదారులు

తెనాలిఅర్బన్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 10వ వార్డు నాజర్‌పేట నుంచి మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 10వ వార్డు కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో వార్డు నాయకులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధి కల్పిస్తున్నట్టు గుర్తుచేశారు. పదో వార్డులో అగ్రవర్ణాల వారికి రూ.20.79 కోట్ల మేర ప్రయోజనం కల్పించినట్టు వెల్లడించారు. వైఎస్సార్ చేయూత ద్వారా 92 మందికి, ఆసరా ద్వారా 44, విద్యా, వసతి దీవెన ద్వారా 73, ఈబీసీ నేస్తం ద్వారా 51, కాపు నేస్తం ద్వారా 70, అగ్రిగోల్డ్ సాయం ద్వారా 83, అమ్మ ఒడి ద్వారా 386, పింఛన్ల ద్వారా 367 మందికి ప్రయోజనం కల్పించినట్టు వివరించారు. 451 మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చినట్లు వెల్లడించారు. వార్డులో మొత్తం ఇళ్ళు 1,250 ఉండగా, 4,200 మంది నివసిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు రూ.50 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. రోడ్లు, డ్రెయిన్లు, కరెంట్ స్తంభాలు, కుక్కల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారని, అన్నీ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర కృష్ణబలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, రాష్ట్ర భట్టరాజుల సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్ళబండి సుష్మ, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కుర్రా సుజాత, గొడవర్తి సాయిహరేరామ్, మల్లెబోయిన సువర్ణరేఖాదేవి, షేక్ దుబాయ్‌బాబు, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, 10వ వార్డు నాయకులు దుర్గాప్రసాద్, తురిమెళ్ళ దక్షిణమూర్తి, రాజా, పాండు, జ్ఞాన ప్రసూనంబ, మూసునూరి సదా, బసవేశ్వరరావు, ఆళ్ళ వేణు, శ్రీనివాసరావు, షేక్ ఖాదర్, రాయుడు, దేవిరెడ్డి శ్రీను, దాసరి వాసు, దాసరి మల్లీశ్వరి పాల్గొన్నారు.

నేడు 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం 10వ వార్డు నాజర్‌పేటలోని సంకావారి కోట్ల బజారు నుంచి సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మసీదుల్లో డిజిటల్ గడియారాలు



మసీదులో ఆధునిక డిజిటల్ గడియారం

తెనాలి: పట్టణ మసీదుల్లో అతి పెద్ద ఆధునిక డిజిటల్ గడియారాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి నమాజీల కోసమే ప్రత్యేకంగా రూపొందించినవి. ముంబయి వంటి మహానగరాల్లో లభ్యమయ్యే గడియారాలను దాతలు కొనుగోలు చేసి మసీదులకు బహూకరిస్తున్నారు. పట్టణంలో దాదాపు 21 మసీదులు ఉన్నాయి. వీటిలో గాంధీనగర్ జెండా చెట్టు వీధిలోని మస్జిద్–ఏ–ఆయేషా సిద్ధిఖా, నందులపేటలోని శతాధిక సంవత్సరాల చరిత్ర కలిగిన మస్జిద్–ఏ–జామియా, ఇస్లాంపేటలోని మర్కజ్ మసీదు, వహాబ్‌చౌక్‌లో గల మక్కా మసీదు, పినపాడులోని ఉమరే ఫారుఖహా మసీదు, గంగానమ్మపేటలోని మామూర్ మసీదుల్లో ఇలాంటి ప్రత్యేకమైన డిజిటల్ గడియారాలు కనిపిస్తున్నాయి. ముస్లింలు ప్రతిరోజూ ఐదు పూటలా నమాజ్ చదువుతారు. నమాజ్‌కు ముందు అజాన్ ఇవ్వాల్సిన సమయం, నమాజ్ చదవాల్సిన సమయాల్లో డిజిటల్ గడియారం బీప్ శబ్దంతో గుర్తుచేస్తుంటుంది. కొందరు అర్ధరాత్రి తహాజుత్ నమాజ్ చదువుతారు. ఆ సమయం కూడా ఇందులో ఉంటుంది. రమజాన్ నెలలో ఉదయం సహర్, సాయంత్రం ఇఫ్తార్ వేళలు ఇందులో చూడొచ్చు. సాధారణంగా మన క్యాలెండర్‌తోపాటు ఇస్లాం ప్రపంచం అనుసరించే హిజ్రీ అరబ్బిక్ క్యాలెండరు కూడా ఇందులో ఉండటం మరో ప్రత్యేకత. సూర్యోదయం, సూర్యాస్తమయాల సమయాలతోపాటు గది ఉష్ణోగ్రతను ఎప్పటికప్పుడు చూపిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లోని యాప్‌తో వీటిలో సమయాలు మార్చుకోవచ్చు. ఒకవేళ విద్యుత్‌కు అంతరాయం కలిగి, గడియారం ఆగిపోయినా, కరెంటు రాగానే కంటిన్యూ అవుతుంటుంది. ఇన్ని సౌకర్యాలతో కూడిన అతి పెద్ద డిజిటల్ గడియారాలు తమకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని నమాజీలు సంతోషపడుతున్నారు.

8న చెన్నకేశవుని తిరుకల్యాణ మహోత్సవం

రేపల్లె: పేటేరు గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 8న శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ భూ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

నేడు నరసింహస్వామి రథోత్సవం

పిట్టలవానిపాలెం: అల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత నరసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ.. బుధవారం అన్న సంతర్పణ, సాయంత్రం 4 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుందని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం రేపు

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు శ్రీనివాసపురంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చైత్ర శుద్ధ పౌర్ణమి గురువారం వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపీచంద్ తెలిపారు. బుధవారం శతకలశ స్నపన జరుగుతుందన్నారు. కల్యాణం అనంతరం అన్న సంతర్పణ, స్వామివారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

తాడికొండ: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరును ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తుళ్లూరు సీఐ ఆనందరావు తెలిపారు. మల్కాపురం గ్రామ పరిధిలోని లక్ష్మీ మౌర్య దాబా అండ్ రెస్టారెంట్ ఎదురుగా ట్రాక్టరును ఆపి తనిఖీలు నిర్వహించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గమనించిన ఎస్‌ఈబీ అధికారులు కేసు నమోదు చేసి ట్రాక్టరును ఠాణాలో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఎయిమ్స్‌కు తీరనున్న నీటి సమస్య



ఎయిమ్స్ ఆవరణలో జరుగుతున్న తాగునీటి సంపు నిర్మాణం

మంగళగిరి: ఎయిమ్స్ నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఏడాది రూ.8 కోట్లతో పనులు చేపట్టింది. ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎయిమ్స్‌కు అవసరమైన మూడు నుంచి నాలుగు ఎంఎల్‌డీల సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు, సంపుల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. గుంటూరు చానల్ నుంచి ఆత్మకూరు చెరువుకు నీరు మళ్లించి అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి నీరు అందించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి కావొస్తున్నాయి. ఎయిమ్స్ ఆవరణలో ఆయా బ్లాకులకు దగ్గరగా తాగునీటి సంపులు, ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఆరు సంపులు, ట్యాంకులలో ఇప్పటికే సగభాగం పూర్తి కాగా మిగిలిన పనులు మరి కొద్దిరోజుల్లో పూర్తి కానున్నాయి. దీంతో ఎయిమ్స్‌కు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ప్రస్తుతం ఆసుపత్రి అవసరాలకు మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ నుంచి ట్యాంకర్ల ద్వారా ఆరు లక్షల లీటర్ల నీరు, తాడేపల్లిలోని పవర్ బోర్ల ద్వారా మరో 2లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ ఎయిమ్స్ అవసరాలకు 8 లక్షల నుంచి 10 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఎయిమ్స్‌లో అన్ని విభాగాల్లో వైద్య సౌకర్యాలు అందుతుండటంతో రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2500 – 3వేల మంది రోగులు వైద్య సేవలను అందుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత తాగునీటి పథకం త్వరితగతిన పూర్తి చేసి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఎయిమ్స్‌కు శాశ్వత నీటి సమస్య తీరనుందని ప్రజారోగ్యశాఖ అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధైర్యలక్ష్మి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు మంగళవారం తిరుమంజన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రథమ వార్షికోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ధైర్యలక్ష్మి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి తిరుమంజన సేవ నిర్వహించామన్నారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు 9 సన్నిధులలో కనకాంబరం పుష్పాలతో సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపాఠశాల విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై శిక్షణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక కేంద్రం వైద్యులు డాక్టర్ కేవీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న సేవల గురించి జిల్లా ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ఎస్.బాలస్వామి ఆరోగ్యమిత్ర సిబ్బందికి, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారని అన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ శిక్షణ మ్యాన్యువల్ బుక్‌లెట్‌ని ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ మానస, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ఎస్.బాలస్వామి, కె.సూర్యనారాయణ, సీహెచ్‌ఓ సీహెచ్ గురుకుమార్, డీపీఎంఓ రామచంద్రరావు, హెల్త్ సూపర్‌వైజర్ షేక్ నాగుల్‌మీరా, శ్రీలక్ష్మి, కె.శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• మురిపించెను



తెనాలిలో వృద్ధునికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ గోపాలకృష్ణ



తెనాలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్

తెనాలి పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం కొనసాగింది. ఉదయం నుంచే వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛన్ నగదును అందజేశారు. సంతోషంతో లబ్ధిదారులు మోములు మెరిసిపోయాయి. కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అక్కడికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించారు. – తెనాలిఅర్బన్

జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాన్ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: బాబూ జగ్జీవన్‌రామ్(బీజేఆర్) జయంత్యుత్సవాన్ని జయప్రదం చేద్దామని బీజేఆర్ జయంతి కమిటీ సభ్యులు కోరారు. కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించనున్న కార్యక్రమ వివరాలను తెలియజేశారు. జయంతి వేడుకల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సుద్దపల్లి నాగరాజు, కొమ్ము రాయల్, అత్తోట శరత్, మేకల సురేష్, ఇందుపల్లి రాజారామ్ తదితరులు మాట్లాడుతూ ఈనెల 5న బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని తెనాలిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఐతానగర్ లింగారావు సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందని వెల్లడించారు. ముందుగా సాయంత్రం 4 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి భారీ ర్యాలీ ప్రారంభమవుతుందని, ముఖ్య కూడళ్ల మీదుగా ఐతానగర్ చేరుకుని అక్కడ బహిరంగ సభలో దళిత మేధావులు ప్రసంగిస్తారని చెప్పారు. విలేకరుల సమావేశంలో తెనాలి రాంకీ, అత్తోట చంటి, అత్తోట(వెన్నెల) శ్యామ్, మట్లపూడి రాజేశ్వరరావు, నలుకుర్తి రమేష్, యడ్లపల్లి అనిల్, గొరికపూడి రవి, కమల్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వాచ్‌మెన్ ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న శాంతకుమార్ మృతదేహం

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో స్కూల్ వాచ్‌మెన్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చంద్రబాబు కాలనీలో నివసించే బత్తుల శాంతకుమార్(36) గతంలో ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రస్తుతం ఓ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విభేదాల వల్ల అతని భార్య లక్ష్మీతిరుపతమ్మ తన కుమారుడు, కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. తిరిగి రమ్మన్నా రాకపోతుండడంతో మనస్తాపం చెందిన శాంతకుమార్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు మంగళవారం ఉదయం సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడగా శాంతకుమార్ ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఇదిలా ఉంటే ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మెన్‌గా శాంతకుమార్ చేస్తున్న ఉద్యోగాన్ని తనకు ఇప్పించాలని భార్య ఒత్తిడి చేస్తోందని మృతుడి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే భార్య పుట్టింటికి వెళ్లిపోయినట్లు విమర్శించారు. స్థానికుల ఫిర్యాదుతో త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అమ్మవారిని చైత్ర మాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు తాడికొండలో ఆసరా చెక్కుల పంపిణీ

తాడికొండ: నేడు తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు, రీజనల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొననున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

మంగళగిరి: నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. రైల్వే సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన రైల్వే పోలీస్ సిబ్బంది చేరుకుని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని గుంటూరు రైల్వే ఆసుపత్రికి తరలించారు. సుమారు 30–35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుడు ఒంటిపై గులాబీ రంగు చొక్కా, సిమెంటు కలరు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు.